సాక్షి చిత్తూరు

గురువారం। 12। జనవరి। 2023



చిత్తూరు బులియన్

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.54,000
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,060

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.69,000
రిటైల్ వెండి గ్రాము	రూ.71

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	31	16
తిరుపతి	31	16
తిరుమల	27	12
గూడూరు	31	18
నగరి	32	17

బోయకొండలో ప్లాస్టిక్ నిషేధం



బోయకొండ ఆలయం, పరిసరాల్లో ప్లాస్టిక్‌ను నిషేధించినట్లు చైర్మన్ మిద్దింటి శంకర్ నారాయణ తెలిపారు. పాలకమండలి సమావేశంలో పలు తీర్మానాలు చేసినట్లు పేర్కొన్నారు.

- వివరాలు 8లో▸

న్యూస్‌రీల్

జిల్లా ఆస్పత్రిలో డాక్టర్ల సర్దుబాటు

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరంలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో ఆరుగురు స్పెషలిస్ట్ డాక్టర్లను సర్దుబాటు చేస్తూ రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్ చర్యలు తీసుకున్నారు. ఒక్కో విభాగంలో ఒక స్పెషలిస్ట్ ఉండేలా చూస్తున్నారు. ఈ క్రమంలో ఇద్దరున్న విభాగాల్లో ఒకరిని మాత్రమే ఉంచి మరొకరిని సర్దుబాటు చేస్తున్నారు. గైనిక్ నుంచి ఇద్దరు డాక్టర్లు, కంటి విభాగం నుంచి ఇద్దరు, ఈఎన్‌టీ విభాగంలో ఒకరు, జనరల్ వార్డు నుంచి ఒకరిని వివిధ ఆస్పత్రులకు కేటాయించేందుకు మంగళవారం రాత్రి కౌన్సెలింగ్ నిర్వహించారు. త్వరలో ఆర్డర్లు రానున్నట్లు ఆస్పత్రి అధికారులు చెబుతున్నారు.

జగనన్న గోరుముద్ద మెనూలో స్వల్ప మార్పులు

చిత్తూరు కలెక్టరేట్ : సర్కారు బడుల్లో అమలు చేస్తున్న జగనన్న గోరుముద్ద పథకం మెనూలో ప్రభుత్వం స్వల్ప మార్పులు చేసినట్లు డీఈఓ విజయేంద్రరావు తెలిపారు. ఆయన బుధవారం విలేకరులతో విలేకరులతో మాట్లాడుతూ కొత్త మెనూను జిల్లాలోని డీవైఈఓలు, ఎంఈఓలకు పంపామని, మెనూ గురువారం నుంచి అమలులో ఉంటుందని పేర్కొన్నారు. అందరూ తప్పనిసరిగా అమలు చేయాలని సూచించారు.

నేటి నుంచి స్కూళ్లకు సెలవులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని యాజమాన్య పాఠశాలలకు గురువారం నుంచి సంక్రాంతి సెలవులు ప్రకటించారు. 18వ తేదీ వరకు అన్ని యాజమాన్య పాఠశాలలు తప్పనిసరిగా సెలవులు అమలు చేయాలని డీఈఓ విజయేంద్రరావు తెలిపారు. 19వ తేదీన పాఠశాలలను పునఃప్రారంభించాలన్నారు. రాష్ట్ర ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ ఆదేశాల మేరకు సమ్మేటివ్ పరీక్షల జవాబు పత్రాలను దిద్ది ఈ నెల 20వ తేదీన విద్యార్థులకు అందజేయాలని సూచించారు. మార్కుల వివరాలను విద్యార్థులకు తెలియజేయాలని తెలిపారు. 22వ తేదీన విద్యార్థుల సమ్మేటివ్ పరీక్షల ఫలితాలను రిజిస్టర్‌లో, వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు.

ప్రతి కుటుంబానికీ సంక్షేమం



వైఎస్సార్ హెల్త్ క్లినిక్ ప్రారంభోత్సవంలో మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ రెడ్డెప్ప, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

- జన్మభూమి కమిటీల మధ్యవర్తిత్వం లేదు
- పారదర్శకంగా పథకాల అమలు
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

సదుం: అర్హత కలిగిన ప్రతి పేద కుటుంబానికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ ధ్యేయమని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. ఆయన బుధవారం సదుం మండలంలోని పాలమంద, 78ఏ చింతమాకులపల్లె, చింతలవారిపల్లె, ఊటువల్లె పంచాయతీల్లో పల్లె బాట కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం చేశారు. మంత్రి మాట్లాడుతూ పేదలకు ఆర్థిక స్వావలంబన కల్పించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి లక్ష్యమని తెలిపారు. పథకాల మంజూరులో ప్రస్తుతం గత ప్రభుత్వంలో జన్మభూమి కమిటీల మధ్యవర్తిత్వం ఉండేదని, నేడు ఆ పరిస్థితి లేదన్నారు. సచివాలయాల ద్వారా అర్హులను గుర్తించి నేరుగా వారి ఖాతాల్లోకి నగదు జమ చేసి పథకాలను పారదర్శకంగా అమలు చేస్తున్నట్లు వివరించారు. నిరంతరం ప్రజల శ్రేయస్సు కోసం శ్రమిస్తున్న సీఎం జగన్ కు అందరూ అండగా నిలిచి రానున్న ఎన్నికల్లో గతంలో కంటే గొప్ప విజయాన్ని అందించాలని కోరారు.

వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ, జనసేన నేతల చేరిక



పార్టీలో చేరిన వారితో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

సదుం మండలంలోని ఊటువల్లె పంచాయతీ తుమ్మగుంటపల్లెకు చెందిన టీడీపీ, జనసేన నాయకులు పెనుబాల వెంకటరమణ, పెనుబాకు జనవయ్యకు సంబంధించిన 10 కుటుంబాల వారు మంత్రి పెద్దిరెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి మంత్రి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీ కోసం కష్టపడే వారికి గుర్తింపు ఉంటుందని తెలిపారు. సంక్షేమ పథకాల అమలు, నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను చూసి పలువురు పార్టీలో చేరుతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఎంపీ రెడ్డెప్ప, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ పరిశీలకుడు జింకా చలపతి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, జెడ్పీటీసీ సోమశేఖర్‌రెడ్డి, ఎంపీపీ యల్లప్ప, డీఎంహెచ్ఓ డాక్టర్ ప్రకాశం తదితరులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు జగనన్న తోడు

- పూర్తి వడ్డీ భారాన్ని భరిస్తున్న ప్రభుత్వం
- జిల్లాలో 31,649 మందికి రూ.84,80,447ల వడ్డీ జమ
- 6వ విడతలో 13,763 మందికి రూ.13.76 కోట్ల లబ్ధి
- లబ్ధిదారులకు మెగా చెక్కు పంపిణీ

చిరువ్యాపారులు పెట్టుబడి కోసం అధిక వడ్డీలకు రుణం తీసుకుని తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గమనించిన ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వారికి వడ్డీ లేకుండా పెట్టుబడి సాయం అందించాలని భావించారు. జగనన్న తోడు పథకాన్ని అమలుచేసి ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున రుణం అందజేస్తున్నారు. తద్వారా వారి ఆర్థిక స్వావలంబనకు కృషి చేస్తున్నారు. ఈ క్రమంలోనే బుధవారం ఆరో విడత జగనన్న తోడు కార్యక్రమాన్ని చేపట్టారు. లబ్ధిదారుల ఖాతాలకు వడ్డీ నగదును జమ చేశారు.



లబ్ధిదారులకు మెగాచెక్కు అందజేస్తున్న మేయర్ అముద, జెడ్పీవైస్ చైర్మన్ రమ్య, కలెక్టర్ హరి నారాయణన్

చిత్తూరు కలెక్టరేట్ : రాష్ట్ర ప్రభుత్వం జగనన్న తోడు ద్వారా చిరు వ్యాపారులకు భరోసాగా కల్పిస్తోందని చిత్తూరు మేయర్ అముద, జెడ్పీ వైస్ చైర్మన్ రమ్య తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం తాడేపల్లి నుంచి వర్చువల్ పద్ధతిలో 6వ విడత జగనన్న తోడు పథకాన్ని ప్రారంభించారు. బటన్ నొక్కి లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి వడ్డీ సొమ్మును జమచేశారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ హరినారాయణన్ అధ్యక్షతన నిర్వహించిన జిల్లా స్థాయి కార్యక్రమంలో మేయర్, జెడ్పీ వైస్ చైర్మన్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. మేయర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న తోడు పథకం కింద చిరువ్యాపారులు, హస్తకళలు, సంప్రదాయ చేతివృత్తుల వారికి ఒక్కొక్కరికి ప్రతి ఏటా రూ.10 వేల చొప్పున వడ్డీలేని రుణం ఇస్తున్నట్లు తెలిపారు. కలెక్టర్ హరినారాయణన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జగనన్న తోడు పథకం కింద అర్హులకు సంవత్సరానికి రూ.10 వేల రుణాన్ని బ్యాంకుల ద్వారా అందిస్తున్నట్లు తెలిపారు. పూర్తి వడ్డీ భారాన్ని ప్రభుత్వమే భరిస్తోందన్నారు. జిల్లాలో 6వ విడత జగనన్న తోడు కింద 13,763 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున రూ.13.76 కోట్ల లబ్ధి కలిగిందని తెలిపారు. జిల్లాలో 31,649 మంది లబ్ధిదారులకు సంబంధించి రూ.84,80,447ల వడ్డీ జమ చేసినట్లు తెలిపారు. అనంతరం లబ్ధిదారులకు మెగా చెక్కు అందజేశారు. కార్యక్రమంలో స్త్రీశిశు సంక్షేమ శాఖ కర్నూలు రీజియన్ చైర్ పర్సన్ శైలజారెడ్డి, డీఆర్డీఏ పీడీ తులసి, జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

వడ్డీ వ్యాపారుల బాధ తప్పింది



నేను నాలుగేళ్లుగా చిత్తూరు కొత్త బస్టాండ్‌లో పండ్ల వ్యాపారం చేసుకుంటున్నా. పెట్టుబడి కోసం వడ్డీ వ్యాపారుల నుంచి అప్పు తీసుకుని తిరిగి చెల్లించేందుకు ఇబ్బందులు పడాల్సి వచ్చేది. ప్రభుత్వం జగనన్న తోడు కింద రూ.10 వేల సాయం అందించింది. దాన్ని తిరిగి చెల్లించడంతో రెండోసారి కూడా లబ్ధి పొందాను. ప్రస్తుతం వడ్డీ వ్యాపారుల బాధ తప్పింది. ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం. – ఎస్.అమ్ములు, పళ్లియప్పనగర్, చిత్తూరు

చిరు వ్యాపారులకు జగనన్న అండ



నేను చిన్నషాప్ తీసుకొని టైలరింగ్ చేసుకుంటున్నా. జగనన్న తోడు పథకం కింద రూ.10 వేలు తీసుకుని టైలరింగ్‌కు సంబంధించిన కొన్ని వస్తువుల అమ్మకం చేపట్టాను. తర్వాత స్వయం సహాయక సంఘం సభ్యురాలిగా రూ.1.25 లక్షల రుణం పొందాను. వ్యాపారాన్ని వృద్ధి చేసుకున్నాను. నేను అభివృద్ధి చెందడానికి తోడ్పాటు అందించిన రాష్ట్ర ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు.

– ఎ.విజయలక్ష్మి, పూతలపట్టు మండలం


ప్రభుత్వం ఆసరాగా నిలుస్తోంది



కూలి పనులు చేసే భర్తకు తోడుగా ఉండేందుకు కూరగాయల వ్యాపారాన్ని ప్రారంభించాను. జగనన్న తోడు పథకం కింద రామాపురం సప్తగిరి గ్రామీణ బ్యాంకు రూ.10 వేలు పొందాను. గతంలో రూ.10 వేలకు వడ్డీ కింద రూ.1000 పట్టుకుని ఇచ్చేవారు. ఇప్పుడు ఆ బాధ తప్పింది. ప్రభుత్వమే వడ్డీ లేకుండా ఆర్థిక సాయం అందిస్తోంది. జగనన్నకు రుణపడి ఉంటాము.

– సరిత, కుప్పిగానిపల్లి, గుడిపాల మండలం

నా కుటుంబానికి జగనన్న తోడు నిలిచాడు



కోవిడ్ సమయంలో కూలి పనులు లేక కుటుంబ పోషణ కష్టంగా మారింది. జగనన్న తోడు పథకం కింద రూ.10 వేలు సాయం పొంది ఇంటి వద్దే బొండాలు, బజ్జీల వ్యాపారం ప్రారంభించాను. వడ్డీని కూడా ప్రభుత్వమే చెల్లించడం సంతోషంగా ఉంది. అలాగే స్వయం సహాయక సంఘం ద్వారా రూ.1.25 లక్షల రుణం పొందాను. మా కుటుంబానికి తోడుగా ఉన్న జగన్నకు రుణపడి ఉంటాం. – ఎస్.గుల్జార్‌బీ, 14కమంద్రిగ, యాదమరి మండలం

పరిశ్రమలకు ప్రభుత్వం పెద్దపీట



స్థలాన్ని పరిశీలిస్తున్న జేసీ వెంకటేశ్వర్

శ్రీరంగరాజపురం : రాష్ట్ర ప్రభుత్వం సూక్ష్మ చిన్నతరహా పరిశ్రమలకు పెద్దపీట వేస్తోందని జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. ఆయన బుధవారం శ్రీరంగరాజపురం మండలంలోని 49 కొత్తపల్లిమిట్ట వద్ద హెర్బల్ ఎక్స్‌ట్రాక్షన్ పరిశ్రమ కోసం కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలో 4.18 ఎకరాల్లో పరిశ్రమను ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. తద్వారా నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కలుగుతాయని తెలిపారు. హెర్బల్ ఎక్స్‌ట్రాక్షన్ ప్రొడక్టులకు మంచి డిమాండ్ ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ లోకనాథం, ఆర్ఐ త్యాగరాజులు, మండల సర్వేయర్ మురళి, వీఆర్ఓ శశికుమార్ పాల్గొన్నారు.

రూ.10,367.57 కోట్లతో నాబార్డు రుణప్రణాళిక

- డిజిటల్ బ్యాంకింగ్‌పై అవగాహన కల్పించండి
- రుణప్రణాళిక పుస్తకావిష్కరణలో కలెక్టర్



రుణప్రణాళిక పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హరి నారాయణన్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో 2023–24 ఆర్థిక సంవత్సరానికి రూ.10,367.57 కోట్లతో నాబార్డు రుణ ప్రణాళికను రూపొందించినట్లు కలెక్టర్ హరినారాయణన్ తెలిపారు. ఆయన బుధవారం కలెక్టరేట్‌లో నాబార్డు రూపొందించిన రుణప్రణాళిక పుస్తకాన్ని ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ ప్రణాళిక జిల్లా సమగ్రాభివృద్ధికి ఉపయోగపడుతుందన్నారు. రిజర్వు బ్యాంకు సూచనల మేరకు డిజిటల్ బ్యాంకింగ్ సేవలను విస్తృతం చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే బ్యాంకింగ్ సేవలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. డిజిటల్ లావాదేవీల్లో పిన్, పాస్ వర్డ్, సీవీవీల గోప్యత పాటించాలన్నారు. కార్యక్రమంలో నాబార్డు జిల్లా మేనేజర్ సునిల్, సప్తగిరి గ్రామీణ బ్యాంకు చైర్మన్ ఎస్ఎస్ఎన్ ప్రసాద్, ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ కిశోర్ రెడ్డి, ఇండియన్ బ్యాంక్ డీజీఎం రాజేశ్, డీసీసీబీ జీఎం లిల్లీ క్యాథరిన్, కెనరా బ్యాంక్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

16 నుంచి ఫేషియల్ అటెండెన్స్ తప్పనిసరి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా అన్ని శాఖల్లో ఈ నెల 16 నుంచి ఫేషియల్ అటెండెన్స్ తప్పనిసరిగా నమోదు చేయాలని కలెక్టర్ హరినారాయణన్ ఆదేశించారు. ఆయన బుధవారం జేసీ ఎస్.వెంకటేశ్వర్, డీఆర్వో రాజశేఖర్‌తో కలిసి క్షేత్రస్థాయి అధికారులతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా స్పందన, జీఎస్‌డబ్ల్యూఎస్, రెవెన్యూ, ఫేషియల్ హాజరు, ఎపిక్ కార్డుకు ఆధార్ అనుసంధానం తదితర అంశాలపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి సంబంధిత యాప్‌ను ఫోన్లో డౌన్‌లోడ్ చేసుకుని అటెండెన్స్ నమోదు చేసేలా విభాగాధిపతులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సచివాలయాల్లో తప్పనిసరిగా స్పందన కార్యక్రమం నిర్వహించాలని తెలిపారు. రిజిస్టర్లు పకడ్బందీగా ఉండాలని సూచించారు. అధికారులు సచివాలయాలను తనిఖీ చేసి స్పందన అర్జీలను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశారా లేదా అని పరిశీలించాలని తెలిపారు. సచివాలయాల్లో శాఖల వారీగా దీర్ఘకాలికంగా విధులకు గైర్హాజరైన వారిపై చర్యలు చేపట్టాలని తెలిపారు. ఎపిక్ కార్డుకు 100 శాతం ఆధార్ అనుసంధానం ప్రక్రియను పూర్తి చేసేలా చూడాలని తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జెడ్పీ సీఈవో ప్రభాకర్‌రెడ్డి, పీఆర్, ఆర్ అండ్ బీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈలు చంద్రశేఖర్‌రెడ్డి, దేవానందం, నాగజ్యోతి, హౌసింగ్ పీడీ పద్మనాభం, డీఆర్‌డీఏ పీడీ తులసి, సీపీవో ఉమాదేవి, డ్వామా పీడీ గంగాభవాని, డీపీవో లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గణనాథుని సేవలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి




వినాయకుని సన్నిధిలో తెలంగాణ హైకోర్టు జడ్జి వెంకటేశ్వర రెడ్డితో ఆలయ అధికారులు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామిని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకటేశ్వర రెడ్డి దర్శించుకున్నారు. బుధవారం సాయంత్రం ఆయన కుటుంబ సమేతంగా స్వామివారి దర్శనార్థం విచ్చేశారు. ఆయనకు ఆలయ సూపరింటెండెంట్ కోదండపాణి, శ్రీనివాస్ స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం ఆశీర్వాద మండపంలో వేదపండితులచే ఆశీర్వచనం అందించి స్వామివారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలాజీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.


ఆ టీచర్లకు తాత్కాలిక స్థానాలు కేటాయించాలి

చిత్తూరు కలెక్టరేట్ : విల్లింగ్ ఇచ్చిన ఉద్యోగోన్నతి టీచర్లకు తాత్కాలిక స్థానాలు కేటాయించాలని ఆపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలాజీ కోరారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ఉద్యోగోన్నతులకు విల్లింగ్ ఇచ్చిన ఉపాధ్యాయులకు ఇంతవరకు స్థానాలు కేటాయించలేదన్నారు. ఉపాధ్యాయ బదిలీలకు, ఉద్యోగోన్నతికి సంబంధం లేకపోయినా వారికి పోస్టింగ్ ఇవ్వకుండా ఇబ్బంది పెట్టడం తగదన్నారు. ప్రస్తుతం వారి స్థానాల్లో సీనియర్ ఎస్‌జీటీ ఉపాధ్యాయులను సబ్జెక్టు టీచర్లుగా పని సర్దుబాటు చేయాలని ఉత్తర్వులు ఇవ్వడం సరికాదన్నారు. సర్దుబాటులను ఆపి వెంటనే విల్లింగ్ ఇచ్చిన ఎస్‌జీటీ ఉపాధ్యాయులకు అడ్‌హాక్ పద్ధతిలో ఉద్యోగోన్నతులు ఇవ్వాలని కోరారు.

బాబోయ్ చలి







చిత్తూరు జిల్లాను చలి వణికిస్తోంది. మూడు రోజులుగా ఉష్ణోగ్రతలు కనిష్టస్థాయికి పడిపోయాయి. పగటి ఉష్ణోగ్రత 30 డిగ్రీల సెల్సియస్‌కు మించడం లేదు. రాత్రిళ్లు 15 డిగ్రీల సెల్సియస్‌కు పడిపోతోంది. ఈ నేపథ్యంలో రాత్రి 8 గంటలకే మంచు కురుస్తోంది. ఉదయం 9 గంటలైనా పొగమంచు వీడడం లేదు. ప్రజలు చలికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాహనదారులు లైట్లు వేసుకునే వెళ్లాల్సి వస్తోంది. ప్రతి గ్రామంలోనూ ఉదయం, సాయంత్రం జనం చలిమంటలు వేసుకుంటున్నారు. జనవరితోపాటు ఫిబ్రవరిలోనూ ఉష్ణోగ్రతలు మరింత కనిష్ట స్థాయికి పడిపోయే అవకాశం ఉందని, జాగ్రత్తలు పాటించాలని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. – సాక్షి, చిత్తూరు

బోయకొండలో ప్లాస్టిక్ నిషేధం

- ఘనంగా లక్ష కుంకుమార్చన
- మూడు చోట్ల ఆర్చల నిర్మాణం
- లడ్డూ తయారీతో రూ.28 లక్షల ఆదా
- పలు తీర్మానాలకు పాలకమండలి ఆమోదం



మాట్లాడుతున్న ఆలయ కమిటీ చైర్మన్ మిద్దింటి శంకర్‌నారాయణ, ఈఓ చంద్రమౌళి

చౌడేపల్లి: ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయం, పరిసర ప్రాంతాల్లో ప్లాస్టిక్ కవర్ల వాడకాన్ని నిషేధించినట్టు ఆలయ కమిటీ చైర్మన్ మిద్దింటి శంకర్ నారాయణ తెలిపారు. ఆలయ అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయంలో బుధవారం ఈఓ చంద్రమౌళి ఆధ్వర్యంలో పాలక మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. చైర్మన్ మాట్లాడుతూ ఆలయం వద్ద ప్లాస్టిక్ కవర్లు, పేపర్ల వినియోగాన్ని నిషేధిస్తూ పాలక మండలి తీర్మానించినట్టు తెలిపారు. ఫిబ్రవరి 8, 9, 10 తేదీల్లో లక్ష కుంకుమార్చనను ఘనంగా నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. 2023–2024 సంవత్సరానికి సంబంధించి వివిధ హక్కులపై నిర్వహించాల్సిన వేలం పాటల అప్‌సెట్ ధరను నిర్ణయించినట్లు వివరించారు. ఏప్రిల్ నుంచి టెండర్ నిబంధనల్లో మార్పు చేసి మడుగుదొడ్ల నిర్వహణకు భక్తుల నుంచి రుసుం వసూలు చేయరాదని తీర్మానించినట్టు తెలిపారు. సిబ్బందితో 20 నెలలు లడ్డూ ప్రసాదం తయారీ చేయించడంతో ఆలయానికి రూ.28 లక్షల ఖర్చు తగ్గిందన్నారు. భవానీ నగర్ క్రాస్ నుంచి ఆలయం వద్ద గల కాంప్లెక్స్ వరకు విద్యుదీకరణ, భవానీ నగర్, కల్లూరు, పుంగనూరు కొత్త రోడ్డు వద్ద నూతన ఆర్చి ఏర్పాటుకు ఆమోదం తెలిపినట్టు పేర్కొన్నారు. యాత్రికులకు సౌకర్యంగా దారి తెలిపే బోర్డులను ఏర్పాటు చేయడానికి అంగీకారం తెలిపినట్టువెల్లడించారు. పాలక మండలి సభ్యులు రమేష్‌నారాయణరెడ్డి, శ్రావణి, స్వరూపారెడ్డి, ఈశ్వరమ్మ, పాలకమండలి మాజీ సభ్యుడు రాయల మోహన్, ఎక్స్‌అఫిషియో సభ్యుడు గంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సేలం టూ మేఘాలయకు పాదయాత్ర



కాలినడకన వెళ్తున్న తల్లీకొడుకులు

శాంతిపురం: కాలుష్య రహిత పర్యావరణం, కాలినడక ఆవశ్యకతను తెలియజెప్పేందుకు తమిళనాడుకు చెందిన ఓ యూట్యూబర్ తన తల్లితో కలిసి 3,200 కిలోమీటర్ల దూరం పాదయాత్ర చేపట్టాడు. తమిళనాడులోని సేలంకు చెందిన సంజయ్ యూట్యూబ్‌లో సంజయ్ ట్రావెల్ వోల్గ్ పేరిట చానల్ నడుపుతున్నాడు. తాను అనుకున్న లక్ష్యం మేరకు మేఘాలయ వరకు పాదయాత్ర చేయాలని నిర్ణయించుకున్నాడు. అతని ప్రయత్నాన్ని తల్లి మెచ్చుకుని తాను కూడా వెంట వెళ్లాలనుకుంది. ఇద్దరూ జనవరి 1న సేలంలో బయలుదేరారు. బుధవారం శాంతిపురం మండలం గుండా పలమనేరు జాతీయ రహదారిలో నడిచి వెళ్లారు. రెండు వందల రోజుల్లో మేఘాలయ చేరుకోవాలనే లక్ష్యంతో తాము నడక సాగిస్తున్నామని చెప్పారు. కాలుష్యాన్ని అరికట్టకపోయినా, నడక వంటి కనీస వ్యాయామాల విషయంలో నిర్లక్ష్యం చూపితే మానవ మనుగడ కష్టం అవుతుందని వారు తెలిపారు. పాదయాత్ర ద్వారా కొందరిలోనైనా మార్పు వచ్చినా ప్రయత్నం ఫలించినట్టేనని చెప్పారు.

చంద్రబాబువి తప్పుడు ఆరోపణలు

కుప్పం రూరల్: కుప్పం పర్యటన సందర్భంగా చంద్రబాబు నాయుడు రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై చేసిన ఆరోపణలు నిరాధారమైనవని కుప్పం గ్రానైట్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. వారు బుధవారం కుప్పంలో విలేకరులతో మాట్లాడారు. తాము ఎవరికీ ఒక్క రూపాయి కూడా ఇవ్వడం లేదన్నారు. చంద్రబాబు కుప్పంలో ఘర్షణ వాతావరణం సృష్టించాలనే తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం తీసుకువచ్చిన నిబంధనల వల్ల తమ వ్యాపారం మరింత సులభతరంగా మారిందన్నారు. తమ సమస్యలను మంత్రి వెంటనే పరిష్కరిస్తున్నారని చెప్పారు. టీడీపీ హయాంలో లాగా ఇప్పుడు దళారీ వ్యవస్థ లేదని, న్యాయపరంగా లీజులు పొందిన వారు క్వారీలు సక్రమంగా నడుపుకుంటూ చాలా మందికి ఉపాధి కల్పిస్తున్నామని వివరించారు. లేనిపోని ఆరోపణలు చేసి గందరగోళం సృష్టించవద్దని కోరారు. సమావేశంలో గ్రానైట్ అసోసియేషన్ సభ్యులు నారాయణ, నటరాజ్, సునీల్, మంజునాథ్, టమాటా శ్రీనివాస్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

మదర్‌థెరిసా కళాశాలకు న్యాక్ ఏ ప్లస్ గ్రేడ్



మదర్‌థెరిసా కళాశాల లోగో

గంగవరం: మండలంలోని మదర్‌థెరిసా ఇంజినీరింగ్ కళాశాలకు న్యాక్ ఏ ప్లస్ గ్రేడ్ లభించిందని కరస్పాండెంట్ రవీంద్రబాబు తెలిపారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ కళాశాలలో విద్యాప్రమాణాలు, అధ్యాపకుల పనితీరు, మౌలిక సదుపాయాలు, విద్యార్థులకు శిక్షణ తదితర విషయాలను పరిశీలించిన నాక్ కమిటీ తమ కళాశాలకు అత్యున్నత స్థాయిలో ఏ–ప్లస్ గ్రేడ్‌ను అందజేసినట్టు పేర్కొన్నారు. గతంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో తిరుపతి, మదనపల్లిలో రెండు కళాశాలలు మాత్రమే న్యాక్ ఏ ప్లస్ గ్రేడ్ దక్కించుకున్నాయని, ప్రస్తుతం చిత్తూరు జిల్లాలో తమ కళాశాల మాత్రమే ఏ–ప్లస్ గ్రేడ్ సాధించడం సంతోషంగా ఉందని వెల్లడించారు. కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీకాంతరెడ్డి, నాక్ కోఆర్డినేటర్ మురళీమోహన్, హెచ్‌ఓడీలు, అధ్యాపకుల సమష్టి కృషి వల్లే ఇది సాధ్యమైందని పేర్కొన్నారు. కళాశాల చైర్మన్ సునీల్, అకడమిక్ డైరెక్టర్ రాజేంద్రరెడ్డి పాల్గొన్నారు.

భార్య హత్య కేసులో భర్త అరెస్టు



నిందితుడి అరెస్టు చూపుతున్న పోలీసులు

వెదురుకుప్పం: భార్యను హత్య చేసిన భర్తను అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ గోపి తెలిపారు. ఆయన బుధవారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. మండలంలోని నక్కలాంపల్లెకు చెందిన శేఖర్ పుత్తూరు ప్రభుత్వాస్పత్రిలో పనిచేస్తున్న ఒక మహిళతో వివాహేతర సంబంధాన్ని కొనసాగిస్తున్నాడు. ఈ విషయం తెలియడంతో భార్య తేజశ్రీ(25) భర్తను నిలదీసింది. తన సంతోషానికి అడ్డుపడుతుందని భావించిన శేఖర్ ఈ నెల 8వ తేదీన భార్యను గొంతు నులిమి హత్య చేశాడు. తేజశ్రీ తండ్రి ఫిర్యాదుతో పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. నిందితుడు బుధవారం కార్వేటినగరం మండలం చింతమండి వద్ద ఉండగా అదుపులోకి తీసుకున్నారు. అనంతరం అతన్ని అరెస్టు చేసి పుత్తూరు కోర్టుకు తరలించారు.



ఇద్దరు కార్యదర్శుల సస్పెన్షన్

చిత్తూరు అర్బన్: జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఇద్దరు అమినిటీ కార్యదర్శులను సస్పెండ్ చేస్తూ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అరుణ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. కలెక్టర్ హరినారాయణన్ చిత్తూరు నగరంలోని తేనేబండ, తిమ్మసముద్రం, అనుపల్లి జగనన్న కాలనీలను పరిశీలించారు. పలుచోట్ల కార్యదర్శుల నిర్లక్ష్యంగా కారణంగా నిర్మాణాల్లో జాప్యం జరిగినట్టు కలెక్టర్ గుర్తించారు. ఈ నేపథ్యంలో అలసత్వం చూపిన వారిపై చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను ఆదేశించారు. దీంతో 16 డివిజన్ అమినిటీ కార్యదర్శి సార్యతేజ, 25వ డివిజన్ కార్యదర్శి పూర్ణచంద్రను సస్పెండ్ చేస్తూ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు.

బ్యానర్ల చించివేత కేసులో 8 మంది అరెస్టు

రొంపిచెర్ల: రొంపిచెర్లలో బ్యానర్ల చించివేత కేసులో 8 మంది నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ బుధవారం తెలిపారు. ఈ నెల 7వ తేదీ రాత్రి రొంపిచెర్లలో టీడీపీ, వైఎస్సార్‌సీపీ వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో పలువురు వైఎస్సార్ సీపీ కార్యకర్తలు గాయపడ్డారు. ఈ కేసులో 8 మంది నిందితులను అరెస్టు చేసి పీలేరు కోర్టులో హాజరుపరచగా జడ్జి 14 రోజులు రిమాండ్‌కు ఆదేశించినట్లు ఎస్‌ఐ తెలిపారు. మరికొందరు నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు గురుకుల విద్యార్థులు



మహేంద్రనాయుడు

నదుం: రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీలకు మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ శ్రీనివాసులురెడ్డి బుధవారం తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బుధవారం మదనపల్లెలో నిర్వహించిన అండర్ 14 విభాగంలో షాట్‌పుట్‌లో 7వ తరగతి విద్యార్థి మహేంద్రనాయుడు, 400 మీటర్ల పరుగు పందెంలో 8వ తరగతి విద్యార్థి పవన్‌కుమార్ ద్వితీయ స్థానం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్టు చెప్పారు. శ్రీకాకుళంలో జరిగే పోటీలకు వీరు హాజరుకానున్నట్టు తెలిపారు.

సీఏ ఫలితాల్లో ఎమరాల్డ్స్ ప్రతిభ



ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులతో ఎమరాల్డ్స్ డైరెక్టర్లు

తిరుపతి ఎడ్యుకేషన్: సీఏ ఇన్‌స్టిట్యూట్ ఈనెల 10వ తేదీ విడుదల చేసిన సీఏ ఇంటర్, ఫైనల్ ఫలితాల్లో ఎమరాల్డ్స్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చాటినట్లు ఆ సంస్థ డైరెక్టర్లు ఇ.గిరిధర్ రెడ్డి, కె.విశ్వనాథరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఫలితాల్లో కె.కార్తికేయ, ఆర్.లలిత్, ఏ.మోహన్ వంశీ, ఎ.గగన్ సాయి టాపర్లుగా నిలవడంతో పాటు మొత్తంగా 54 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను, అధ్యాపకుల బృందాన్ని వారు అభినందించారు.

వసంత పంచమికి స్పెషల్ టూర్

తిరుపతి అలిపిరి : వసంత పంచమి పురస్కరించుకుని ప్రత్యేక టూర్ ప్యాకేజీని రూపొందించినట్లు పర్యాటకశాఖ తిరుపతి డివిజనల్ మేనేజర్ గిరిధర్ రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఈనెల 26వ తేదీ ఉదయం తిరుపతి శ్రీనివాసం నుంచి స్పెషల్ యాత్ర బస్సు బయలుదేరుతుందన్నారు. నారాయణవనంలోని వేదనారాయణ స్వామి సన్నిధిలో పిల్లలకు ప్రత్యేకించి అక్షరాభ్యాసం నిర్వహించేలా యాత్రలో పొందుపరిచినట్లు వెల్లడించారు. టూర్‌కు రూ.375 టికెట్ ధర నిర్ణయించినట్లు పేర్కొన్నారు. వివరాలకు 9848007033 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

20 నుంచి డీఎల్‌ఈడీ ప్రాక్టికల్ పరీక్షలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో ఈ నెల 20వ తేదీ నుంచి 25 వరకు డీఎల్‌ఈడీ (డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్) నాలుగో సెమిస్టర్ పరీక్షలు నిర్వహించనునట్లు డీఈఓ విజయేంద్రరావు తెలిపారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ 2020–2022 బ్యాచ్ ఫైనల్ పరీక్షలను నిర్వహించనున్నట్టు తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ డీఎల్‌ఈడీ ప్రిన్సిపాళ్లు ప్రాక్టికల్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని డీఈఓ ఆదేశించారు.

భోగి వెలుగులు.. సంక్రాంతి సొబగులు

ప్రజాసేవలో అహర్నిశలు శ్రమించే పోలీసులు ఆటవిడుపు తీసుకున్నారు. అలుపెరుగక విధులు నిర్వర్తించే రక్షకులు కాస్తంత సేదతీరారు. సంస్కృతి సంప్రదాయాలకు పెద్దపీట వేస్తూ సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు. హోదాలు మరిచి కుటుంబసభ్యులతో కలిసి వేడుకలు నిర్వహించారు.



భోగి మంటలు వీక్షిస్తున్న చెవిరెడ్డి, కలెక్టర్, ఎస్పీ తదితరులు

- పోలీస్ మైదానంలో అంబరాన్నంటిన సంబరాలు
- సంస్కృతి గొప్పదనం చాటేలా ప్రదర్శనలు
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు
- సంప్రదాయ దుస్తులతో హాజరైన అతిథులు
- ఉత్సాహంగా పాల్గొన్న పోలీసు కుటుంబాలు

తిరుపతి కల్చరల్ : తిరుపతి పోలీస్ పరేడ్ మైదానంలో బుధవారం నిర్వహించిన సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. ఎస్పీ పరమేశ్వరరెడ్డి, ఆయన సతీమణి సాయి ప్రసన్న ఆధ్వర్యంలో పోలీస్ కుటుంబాలు ఉత్సాహంగా పాల్గొన్నాయి. సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా రంగవల్లులు వెల్లివిరిశాయి. భోగి మంటల వెలుగులు.. ఎడ్లబండ్ల జోరు.. డూడూ బసవన్నల విన్యాసాలు.. ముత్యాల గొబ్బెమ్మలు ఆకట్టుకున్నాయి. ప్రత్యేకంగా చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ముఖ్యఅతిథులుగా మంత్రి ఆర్‌కే రోజా, ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, కలెక్టర్ వెంకటరమణారెడ్డి దంపతులు, టీటీడీ సీవీఎస్‌ఓ నరసింహకిషోర్, మేయర్ శిరీష, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే కుమార్తె బియ్యపు పవిత్రారెడ్డి హాజరయ్యారు. వివిధ పోటీల్లో గెలుపొందిన పోలీసు కుటుంబసభ్యులకు బహుమతులు పంపిణీచేశారు. సంక్రాంతి సంబరాలకు ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, కలెక్టర్ వెంకటరమణారెడ్డి, ఎస్పీ పరమేశ్వర రెడ్డి ఎడ్లబండిపై మైదానంలోకి రావడం విశేషం. మంత్రి రోజా మాట్లాడుతూ శాంతిభద్రతల రక్షణలో తీరిక లేకుండా విధులు నిర్వర్తించే పోలీసులు సంక్రాంతి సంబరాల్లో భాగస్వాములు కావడం ఆనందంగా ఉందని తెలిపారు. ఎస్పీ పరమేశ్వర రెడ్డి మాట్లాడుతూ రాగద్వేషాలకు అతీతంగా జీవనం సాగించాలని కోరారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు కులశేఖర్, విమలకుమారి, మునిరామయ్య, లక్ష్మీనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ముగ్గు వేస్తున్న ఎస్పీ కుమార్తె ధాత్రిసాయి



బసవన్నకు నమస్కరిస్తున్న మంత్రి ఆర్‌కే రోజా



ఎడ్ల బండిపై పోలీస్ మైదానంలోకి వస్తున్న ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, కలెక్టర్, ఎస్పీ